
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0, కనిష్ఠం 8.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 21 జనవరి 2025

పత్తిని సేకరిస్తున్న సీసీఐ


మావల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి పండించే అన్ని రాష్ట్రాలలో కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) పథకం కింద పత్తిని సేకరిస్తోందని చీఫ్ జనరల్ మేనేజర్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రస్తుతం పత్తి సీజన్ 2024-25 సంవత్సరంలో (అక్టోబరు, 24 నుంచి సెప్టెంబరు 25)లో 345.93 లక్షల క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించిందన్నారు. గ్రేడ్ పత్తిని కొనుగోలు చేస్తూనే ఉంటామని రైతులందరికీ సీసీఐ హామీ ఇస్తుందని పేర్కొన్నారు. సమాచారం కోసం వాట్సప్ నెంబర్ 7718955728ను సంప్రదించవచ్చని తెలిపారు.

రైతుల ఉసురు తీస్తున్న అప్పులు!






జాదవ్‌దేవురావ్ (ఫైల్)




రాథోడ్ గోకుల్ (ఫైల్)

ధైర్యం చెప్పిన కలెక్టర్..

ఇటీవల జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్‌దేవురావ్ కుటుంబాన్ని సోమవారం కలెక్టర్ రాజార్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి పరామర్శించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

- జిల్లాలో ఆగని రైతు బలవన్మరణాలు
- దిగుబడి రాక ఒకరు.. అప్పుల బాధతో మరొకరు
- కలకలం రేపిన బేల, ఉట్నూర్ రైతుల ఆత్మహత్యలు
- అరకొరగానే రుణమాఫీ.. అందని రైతుభరోసా
- బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అప్పులు రైతుల ఉసురుతీస్తున్నాయి. దిగుబడి రాదన్న బెంగతో అప్పులు తీర్చే మార్గంలేక అన్నదాతల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో రైతులు అరిగోస పడుతున్నారు. అతిధీమాతో పంటలను సాగుచేస్తున్నా.. యేటా గడ్డు పరిస్థితులే ఎదురవుతున్నాయి. దీంతో అప్పుల భారం మరింతగా పెరిగి పోవడంతో ఆగమై పోతున్న రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన రైతుల ఆత్మహత్యలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొంత కాలంగా రైతు ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టాయనుకున్న సమయంలోనే మళ్లీ ఆత్మహత్యలు పెరిగిపోవడం ఆందోళన రేపుతోంది. వ్యవసాయం తప్ప.. మరే రంగంలో పరిజ్ఞానం లేని రైతులు గత్యంతరం లేక సాగుపనులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయా, కంది, శనగ పంటలను సాగు చేస్తుంటారు. గడిచిన యేడాదిలో మొత్తం 32 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా ఈ యేడు జనవరిలోనే ఇద్దరు రైతులు ఉసురు తీసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరికొంత మంది రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నా బయటకు రావడం లేదంటున్నారు. అధికార యంత్రాంగం మాత్రం వ్యక్తిగత కారణాలు, తాగుడికి బానిసై ఆత్మహత్యలు చేసుకున్నారంటూ నివేదికలు ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. దీంతో రబీలో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతుబీమా పథకాలు అన్నదాతకు కొంత వరకు అండగా నిలుస్తున్నా.. బిందుసేద్యం, చిన్న నీటి పథకాలపై సబ్సిడీలు ఎత్తివేయడం, పండించిన పంటలకు సరైన మద్దతు ధర దక్కకపోవడం, కుటుంబ భారం, ఇతర సమస్యలతో సతమతమవుతూ గత్యంతరం లేక ఉరి తాళ్లు, పురుగుల మందులను ఆశ్రయిస్తున్నారు. కన్నవారికి, భార్యకు, ఉన్న ఊరుకు దూరమవుతున్నారు.

ఆశలు ఆవిరై..

పంట దిగుబడులపై ఆశలు పెట్టుకుంటున్న రైతులు ఆశించిన దిగుబడులు రాక పోవడంతో ఆవేదనకుగురై ప్రాణాలు తీసుకుంటున్నారు. యేటా పంట దిగుబడులు చేతికొచ్చిన సమయంలోనే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దిగుబడి రాక కొందరు అప్పుల భారం పెరిగి పోవడంతో మరికొందరు బెంగతో ఉసురు తీసుకుంటున్నారు. యేటా రైతు ఆత్మహత్యలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. అసలు రైతుల ఆత్మహత్యలకు కారణాలు ఏమిటి అనే విషయాన్ని అధికార యంత్రాంగం పరిగణలోకి తీసుకున్నట్లే కనిపించడం లేదు. అప్పటి వరకు కళ్ల ముందే కనిపించినా ఇంటి పెద్ద కనిపించకుండా పోవడంతో ఆపదలో ఉన్న రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గతంలో కలెక్టర్ కార్యాలయంలో కిసాన్‌సెల్‌ను ప్రారంభించి రైతుల సాదక బాదకాలను చెప్పుకునే విధంగా ఏర్పాట్లను చేసినా.. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేక పోవడంతో రైతులు తమ బాధను ఎవరికి చెప్పుకునే అవకాశం లేక క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేదీ?

అప్పుల భారం పెరిగి పోవడంతో పరువు ప్రతిష్ఠలకు పోతున్న రైతులు ప్రాణాలు తీసుకుంటూ కుటుంబాలకు దూరమవుతున్నారు. గత వారం రోజుల్లోనే ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తుంటే రైతులు ఎంతటి దీనస్థితిలో ఉన్నారో తెలుస్తూనే ఉంది. ఉట్నూర్ మండలానికి చెందిన రాథోడ్‌గోకుల్ అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే బ్యాంకు అప్పు తీర్చే పరిస్థితి లేక పరువు ప్రతిష్ఠలకు పోయిన బేల మండలం రేణుగూడ గ్రామానికి చెందిన జాదవ్‌దేవురావ్ బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తీవ్రమైన చర్చకు దారి తీసింది. ఇంత జరుగుతున్నా.. అధికార యంత్రాంగం రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. మండల స్థాయిలో ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసి రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తే కొంత మేరకైనా ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. రైతుల గోడును వినేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమిస్తే కొంత మేరకైనా భరోసా కలిగి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షేమ పథకాల్లో జాప్యం..

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పలురకాల సంక్షేమ పథకాలను తీసుకొచ్చినా అమలు చేయడంలో మాత్రం తీవ్రజాప్యం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు ఇక ప్రభుత్వ సహాయం దక్కదన్న ఉద్దేశ్యంతో అప్పులు తీర్చే మార్గం లేక ఉరి తాళ్లు, పురుగుల మందును ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం భరోసా ఇచ్చి ఉంటే కొంత మేరకైనా రైతు ఆత్మహత్యల కట్టడికి అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన పూర్తి స్థాయిలో చేపట్టలేక పోయింది. అరకొరగా చేసిన రుణమాఫీ ఇప్పటికి అందని రైతుభరోసాతో అన్నదాతలు ఆగమై పోతున్నారు. ఒక్క కుటుంబంలో ఇద్దరికి రెండు లక్షల లోపే బ్యాంకు రుణం ఉన్న రుణమాఫీ కాలేదు. కుటుంబంలో ఒకరికి రుణమాఫీ చేసి ఉంటే కొంత మేలు జరిగేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రుణమాఫీ జరుగదన్న బెంగ, పెట్టుబడి సహాయం అందక పోవడంతో రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలతో అన్నదాతల ఆశలు ఆవిరై పోతున్నాయి.

రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వమే అడ్డుకట్ట వేయాలి..

: సంగెపు బొర్రన్న, జిల్లా రైతు స్వరాజ్యవేదిక అధ్యక్షుడు



జిల్లాలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వమే అడ్డుకట్ట వేయాలి. ఆత్మహత్యలకు అసలు కారణం ఏమిటన్నది ప్రభుత్వం గుర్తించి దానానుగుణంగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం రైతు ఆత్మహత్యలను నివారించామని చెబుతున్నా.. జిల్లాలో మాత్రం రైతు ఆత్మహత్యలు ఆగడం లేదు. సరైన పంట దిగుబడులు రాక కొందరు, చేసిన అప్పులు తీర్చలేక మరికొందరు ఉసురు తీసుకుంటునే ఉన్నారు. అరకొరగా పరిహారాన్ని అందిస్తూ ప్రభుత్వం చేతులుదులుపుకుంటుందే తప్ప.. శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదు.

రైతు ఆత్మహత్యలు నివారించాలి..

: బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం నేత



రైతు ఆత్మహత్యలను నివారించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలి. ఏళ్ల తరబడి ఆత్మహత్యలు జరుగుతున్నా శాశ్వతంగా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి రైతుల బాధలు, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపాలి. జిల్లా కమిటీలు వేసి రైతు ఆత్మహత్యల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలి. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు రైతుల ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులను గుర్తించి ధైర్యం చెప్పే విధంగా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

ఫటా..ఫట్...

రిమ్స్‌లో కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు

● రాథోడ్‌జైసింగ్
రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
డైరెక్టర్, ఆదిలాబాద్



ఆంధ్రజ్యోతి : రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు...?

డైరెక్టర్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఐదు డిపార్ట్‌మెంట్లు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయి. ప్రస్తుతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నాం. ముఖ్యంగా యురాలాజి, క్యాన్సర్, పీడియాట్రిక్ సర్జరీ, న్యూరోసర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయా....?

డైరెక్టర్: కొత్తగా నిర్మించి వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన రిమ్స్‌సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇకపై సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేదు. సిటీస్కాన్, ఎంఆర్‌ఐ, టిఫాస్కాన్ అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : నిత్యం ఎంత మంది రోగులు రిమ్స్ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారు...?

డైరెక్టర్: జిల్లా నుంచేకాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి నిత్యం 2వేలకు పైగా మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ఇందులో రిమ్స్‌లో సుమారుగా 2వేలు, సూపర్‌స్పెషాలిటీలో 200లకు పైగా ఓపీ ఉంటుంది. సుమారుగా 700ల నుంచి 800ల మంది ఇన్‌పేషెంట్ రోగులు ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి : వైద్య కళాశాలలో ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి. సరైన వసతులు కల్పిస్తున్నారా...?

డైరెక్టర్: రిమ్స్ మెడికల్ కళాశాలలో పీజీలో 72 సీట్లు, ఎంబీబీఎస్‌లో 120 సీట్లు ఉన్నాయి. ప్రతియేటా 90 శాతానికి పైగా రిజల్ట్ ఉంటుంది. అన్ని రకాలైనా ఆధునికభవన వసతి, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏఏ సేవలను అందిస్తున్నారు....?

డైరెక్టర్ : రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో మొత్తం 42 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. దీనికి అదనంగా టీహబ్ ద్వారా 24 గంటల సేవలు అందిస్తూ మొత్తం 100కు పైగా ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నాం. వెంటనే వ్యాధులను నిర్ధారించి అవసరమైన చికిత్సను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

డైరెక్టర్: ముఖ్యంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. దీని కోసం ప్రత్యేక విభాగం పని చేస్తుంది. ఇటీవలే స్టేట్ లెవల్ గ్రీన్ చాంప్ అవార్డును దక్కించుకోవడం జరిగింది. పరిసరాల పరిశుభ్రత, రోగుల భద్రత విషయంలో అసలురాజీ పడేది లేదు.

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

సమగ్ర పరిశీలన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక

నేరడిగొండ , జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ లక్ష పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపికకు సమగ్ర పరిశీలన చేయాలని మండల ప్రత్యేక అధికారి రవి శంకర్ అన్నారు. లబ్దిదారుల ఎంపికపై బుగ్గరాం గ్రామంలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనను సోమవారం మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్షించారు. రైతు భరోసా కార్యక్రమం కింద సాగుకు యోగ్యమైన భూమి, రేషన్‌కార్డులు వెరిఫికేషన్‌పై క్షేత్రస్థాయి పరిశీలన గ్రామాల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమీక్షించి సూచనలు చేయాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని రెవెన్యూ గ్రామాలు పూర్తి చేశారు. ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తి చేయాల్సి ఉంది, రేషన్ కార్డుల వెరిఫికేషన్ ఎంత వరకు వచ్చింది. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, ఎంఈవో భూమారెడ్డి, ఏపీవో వసంత్‌రావు, ఏపీఎం ఉత్తమ్, ఏఈఈలు నాగేంద్ర ప్రసాద్, సతీష్, సర్వేయర్ శంకర్, ఏఈవో జైపాల్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌రావు, రాజారామ్, గ్రామస్తులు జాదవ్ వసంత్‌రావు, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


తాంసిలో జాబితాను అతికిస్తున్న అధికారులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు

తలమడుగు : అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందని పౌరసంబంధ శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రేమ్ నివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డుల వివరాలను ఆయన పరిశీలించారు. అర్హులై ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ రేషన్ కార్డు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకుని లిస్టులో పేరు రాని లబ్ధిదారులు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో గల రేషన్ షాప్‌లను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ గజానంద్, రేషనడీలర్ వమాన్, మాజీ ఎంపీటీసీ చంటి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు

తాంసి: రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం కాని భూములను సోమవారం గుర్తించారు. తాంసి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో గుర్తించిన భూముల వివరాలను ఆయా గ్రామ పంచాయతీల్లో అతికించారు. ఈ జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే వారి వారి గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో పేర్కొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు గ్రామ సభలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాఘవేంద్ర, కారోబార్ సుభాష్ తదితరులున్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం : ఏఎస్పీ

ఉట్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):నార్నూర్ మండలంలోని మాలేపూర్ గ్రామ శివారులోని ఘాట్‌సెక్షన్ వద్ద మూలమలుపు తిరుగుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఐచర్ బోల్తా పడిందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐచర్ డ్రైవర్ కనుక శ్రీరామ్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే ఐచర్ నడపడం వల్ల ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో 37 మంది ఆదివాసులు గాయపడగా ఇప్పటి వరకు గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన కొమురం మల్కు, తొడసం నాగుబాయిలు ఇద్దరు మరణిం చారని తెలిపారు. గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన కొందరు గాయప డ్డారని తెలిపారు. 35 మంది జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో వైద్యం అందుకుం టున్నారన్నారు. ప్రమాదానికి కారణమైన ఐచర్ డ్రైవర్ శ్రీరామ్‌పై నార్నూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఏఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే డ్రైవర్‌ను అరెస్టు చేశామని ఏఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

మాలేపూర్ ఘటనలో గాయాలైన నాగుబాయి మృతి

ఇంద్రవెల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఐచర్ బోల్తాపడి జరిగిన ఘటనలో తీవ్రగాయాలైన ఇంద్రవెల్లి మండలంలోని సాలే గూడ గ్రామానికి చెందిన తొడసం నాగుబాయి (70) మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాలేగూడ గ్రామానికి చెందిన తొడసం నాగుబాయి గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ గ్రామంలో తమ సమీప బంధువులు నిర్వహిస్తున్న జంగు బాయి దేవత ఉత్సవాలకు వెళ్లారు. ఉత్సవాల్లో భాగంగా అందరితో పాటు జంగుబాయి పుణ్య క్షేత్రం దర్శనం కోసం బంధువులతో కలిసి వెళుతుండగా ప్రమాదవశాత్తు జరిగిన ఐచర్ బోల్తాపడిన ఘటనలో తొడసం నాగుబాయికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన నాగుబాయికి స్థానికులు, పోలీసులు 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్సలు అందించారు. కాగా పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున నాగుబాయి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలి పారు. జంగుబాయి దర్శనం కోసం వెళ్లిన నాగుబాయి మృతి చెందడంతో మండలంలోని సాలేగూడ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతురాలుకు కొడుకులు సుదర్శన్, మనోహర్‌లున్నారు.


మృతిచెందిన నాగుబాయి (ఫైల్)

క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నార్నూర్ రోడ్డు ప్రమాదఘటనలో గాయపడిన గుడిహత్నూర్ మం డలంలో సూర్యగూడ వాసులను సోమవారం మాజీ ఎంపీ సోయం బాపురావు కాంగ్రెస్ నేతలతో కలిసి పరామర్శించారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నా మన్నారు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెంద డం బాధాకరమన్నారు. వెంట నాయకులు ఉన్నారు.

పరామర్శించిన జోగు రామన్న

క్షతగాత్రులను మాజీ మంత్రి జోగురామన్న ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం పరామర్శించారు. వారితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని సూచించారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

ఒలంపియాడ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

నార్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగిన వాతావరణ శాస్త్రం ఒలంపియాడ్ పోటీల్లో నార్నూర్ మోడల్‌స్కూల్ విద్యార్థి కల్వలె ఓంకార్ మూడోస్థానం సాధించి తమ ప్రతిభను చాటాడు. సోమవారం గ్రామస్తులు గ్రామ పంచాయతీలో విద్యార్థిని శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.గజానంద్‌నాయక్ మాట్లాడుతూ నార్నూర్ గ్రామానికి మంచి పేరు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఉత్తమ్ రాథోడ్, ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, యశ్వంత్ రావు చవాన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాదే అల్లి, కళాకారుల జిల్లా అధ్యక్షులు వసంత్ ఆడె, దేవరావు లోకండే, ప్రకాష్, మహేందర్, రాథోడ్ దిలీప్, షేక్ సత్తార్ పాల్గొన్నారు.

ఏకలవ్య స్కూల్స్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

ఇంద్రవెల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సౌరబ్ యాదవ్ తెలిపారు. ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని, తెలంగాణలో 23 ఏకలవ్య పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1380 ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

78 కిలోల గంజాయి దహనం



గంజాయి దహనం చేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో 26 కేసుల్లో పట్టుబడ్డ 78 కిలోల 295 గ్రాముల గంజాయిని పోలీసులు సోమవారం దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా వద్ద గల మెడికర్ సర్వీసెస్ సెంటర్ వద్ద గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీ ఆర్పీ డీఎస్పీ నాగేందర్, సీసీ ఎస్ ఇన్‌స్పెక్టర్ పాండేరావు, డీసీఆర్బీ ఎస్సై హకీమ్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి



బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారుల వేధింపులతో పురుగుల మందు తాగి రైతు జాదవ్ దేవరావు మృతి చెందడం బాధాకరమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బేల మండలం రేణుగూడ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతు ఆత్మహత్య సంఘటనకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబసభ్యులను ఆదుకుంటామని, ప్రభుత్వపరంగా బాధిత రైతుకుటుంబానికి అందాల్సిన పరిహారం వెంటనే అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేముల నాగరాజ్, నాయకులు సామ రూపేష్‌రెడ్డి, నలిమెల నవీన్‌రెడ్డి, ఇర్ఫాన్, అబిబ్, ఆలీమ్ ఉన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కంది

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర ప్యాకెట్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అవసరమైన నిధుల మంజూరుకు సంబంధించి కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఇందులో దేవిదాస్‌దేశ్‌పాండే, రామ్‌కులకర్ణి, పల్లసత్యనారాయణ, నీలకిషన్, విశ్వంబార్, గుండయ్య, ప్రేమ్‌రాజ్‌గౌడ్, జనగమ్‌మోహన్, ఆర్.కిషోర్, కె.గంగాధర్ తదితరులున్నారు.



ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ప్రతీ ఆలయంలో షెడ్ల నిర్మాణం

● కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్

తాంసి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం లో ఉన్న దేవాలయాల సమీపంలో షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజ కవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు అన్నారు. వడ్డాది గ్రామంలో రూ.ఐదు లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును సోమవారం వారు ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. గ్రామాల అభివృద్ధికి, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడు తున్న పథకాలను ప్రతిఒక్కరూ పూర్తిస్థాయిలో సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు, ఉపాధి పథకంలో అవకాశం, రైతు బంధు, రైతు రుణమాఫీ పథకాలలో అందరికీ అవకాశం కల్పిస్తు న్నామన్నారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని సమస్యలను సూచించే వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధర్, హన్మాండ్లు, మండల పార్టీ కన్వీనర్ కౌడాల సంతోష్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షెడ్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, ఆడే గజేందర్

● కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

వడ్డాడి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం గ్రామానికి వచ్చిన బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సమక్షంలో పార్టీ కండు వాను కప్పుకున్నారు. గ్రామానికి చెందిన 23 మంది పార్టీ మారినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకున్న పలువురు మాట్లా డుతూ రేవంత్‌రెడ్డి చేపడు తున్న ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

నేరడిగొండ : మండలంలోని కోర్టికల్ గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, నాయ కులు కరాడ్ బ్రహ్మానంద్, జలంధర్, అజీమ్, షబ్బీర్, శంకర్, పాలశంకర్, కుంట శంకర్, కపిల్, గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ ధర్నా

ఉట్నూర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 50 శాతం గిరిజనులు ఉన్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని, ఏజెన్సీ ప్రాంతాలలో అమలులో ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామరావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో జీవో 3 అమలుతో పాటు, 28 ప్రభుత్వ శాఖలలో గిరిజన సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జీవోలను అమలు చేయాలన్నారు. గిరిజనుల సాగుచేస్తున్న పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని, ఐటీడీఏ విద్యా వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నైతంబాలు, మడావి మనోహర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో గుబిడికి బస్సు

భీంపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల సరిహద్దు గ్రామం గుబిడికి సోమవారం ఆర్టీసీ బస్సు ప్రారంభమయ్యాయి. రోడ్డు బాగా లేక గత వర్షాకాలం నుంచి ఈ గ్రామానికి ఆర్టీసీ వారు బస్సును నడపడం లేదు. దీంతో వారు 8 కిలో మీటర్లు నడిచి కరంజి(టీ)కి వచ్చి ఆ తర్వాత పనుల కోసం మండల కేంద్రం, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ సమస్య గురించి గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు విన్నవించుకోగా ఎమ్మెల్యే రోడ్డు మరమ్మతులు చేయించారు. తర్వాత ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. ఫలితంగా గుబిడికి బస్సులు మొదలయ్యాయి. దీంతో గ్రామస్తులు మేకల ప్రవీణ్, ఎలుపుల ప్రతాప్, తూటీ దత్తు, ఇస్తారి ఎమ్మెల్యే, ఆర్టీసీ డీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అందూర్‌లో టీబీ వ్యాధి పరీక్షలు

బోథ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందూర్‌లో సోమవారం టీబీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 36 మందికి పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ దేవిదాస్, సంధ్య, అనిత, యశోద, శృతి, అర్చనలు పాల్గొన్నారు.

శాంతి, సమానత్వానికి ప్రతీకగా నిలవాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని డోంగ్రాగావ్ సమీపంలో ఉన్న రోమన్ క్యాథలిక్ చర్చి వార్షికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసుప్రభు చూపిన దైవ మార్గంలో నడిచి శాంతి సమానత్వానికి ప్రతీకగా నిలవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో చర్చిపాస్టర్ సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, చర్చి ఫాస్టర్ బిషప్, ప్రిన్స్ అంటోని, బీఆర్ఎస్ నాయకులు పవార్ రవినా యక్, జాదవ్, భీంరావు, బేర దేవన్న, మాధవ్, దోమకొండ సుధాకర్, నక్క భూమన్న, పాటిల్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ని కలిసిన నాయకులు

ఉట్నూర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రివర్యులు కేటీఆర్‌ని హైదరాబాద్ నందినగర్ స్వగృహంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గేళ్ల శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కలిశామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యల పై పోరుబాటపట్టాలని సూచించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ సూచించినట్లు ధరణి రాజేశ్ తెలిపారు.

ఆదిలాబాద్ ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల కంటే ముందు సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా హామీ అమలు చేయలేదన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో అగ్నిప్రమాదం జరిగింది. మహాలక్ష్మివాడకు చెందిన కవిత సోమవారం ఇంట్లో లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి ఇంట్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో వంట సామగ్రి, ఫ్రిడ్జ్ కాలిపోయినట్లు స్థానికులు పేర్కొన్నారు.

స్కూటీని తప్పించబోయి..

లోయలోకి దూసుకెళ్లిన లారీ



ఘాట్‌రోడ్డు నుంచి నేరుగా దూసుకెళ్లిన లారీ

ఇచ్చోడ, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ ఘాట్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో లారీ అదుపుతప్పి రోడ్డు నుంచి కిందకు దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిచెల్మ ఘాట్‌రోడ్డు దిగె క్రమంలో ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయే క్రమంలో లారీ నేరుగా ఘాట్‌రోడ్డు దిగి చెట్టును ఢీకొని ఆగడంతో మరింత లోతులోకి జారకుండా ఆగిపోయింది. గాయపడిన లారీలో ఉన్న డ్రైవర్, ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కావడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

బోథ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సోనాల మండలంలోని ఘన్‌పూర్ రోడ్డుపైన సోమవారం బోథ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ వాడకుండా తిరుగుతున్న వాహన దారులకు జరిమానాలు విధించారు. పోలీసులకు తనిఖీ సమాచారాన్ని తెలుసుకున్న వాహనదారులు ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేసి వేచి చూశారు.

నాలుగు పథకాలపై నిర్వహిస్తున్న

గ్రామసభలను పకడ్బందీగా పర్యవేక్షించాలి

ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్

ఖానాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు ప్రభుత్వ పథకాలపై నిర్వహిస్తున్న గ్రామసభలను పకడ్బందీగా పర్యవేక్షించాలని అధికారులను తహసీల్దార్ శివరాజ్ ఆదేశించారు. మంగళవారం నుంచి మండలంలో గ్రామ సభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు, ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ స్వామి, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి నుంచి గ్రామసభలు



దిలావర్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణరాణి అన్నారు. ఈ గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభల వివరాలను వెల్లడించారు. 21న మాయాపూర్, సిర్గాపూర్, మాడేగాం, 22వ బన్సపల్లి, కంజర్, సాంగ్వి, 23న న్యూ లోలం, కాల్వ, కాల్వ తండా, 24న సముందర్ పల్లి, గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లో దిలావర్‌పూర్ మినహా మిగతా గ్రామాల్లో ఉదయం 9 గంటలకు గ్రామసభలు ప్రారంభ మవుతాయని, దిలావర్‌పూర్ గ్రామసభ 24న 12 గంటలకు ప్రారంభ మవుతుందన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి



కుంటాలలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో

కుంటాల, జనవరి, 20: (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఈ నెల 26వ తేది నుండి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నూతన పథకాలలో అర్హుల గుర్తింపు కోసం ఈనెల 21 నుంచి చేపట్టనున్న గ్రామసభలను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం కుంటాలలో ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ప్రజలకు ముందస్తుగా సమాచారం అందజేసి గ్రామ సభలో ఎక్కువ మంది పాల్గొనేలా కృషి చేయాలని, అర్హుల గుర్తింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు.

కూచన్‌పెల్లి గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేయండి

సోన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచన్‌పెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. గ్రామ స్వాగత తోరణం నుంచి గ్రామం వరకు గుంతలు, కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిచిన గీతలు ఉన్నాయి. ఈ దారి వెంట వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అయితే ఇదివరకు పలుమార్లు వాహనదారులు కిందపడి గాయాలపాలయ్యారు. వెంటనే ఆర్ అండ్ బి శాఖ అధికారులు చర్యలు చేపట్టి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిర్మల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి





ఆలూర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి చేస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి

సారంగాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో గల బీరవెల్లి, ఆలూర్, వైకుంఠాపూర్, తాండ్ర, బోరిగాం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నటువంటి బీఆర్ఎస్ పార్టీ నాయకులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గాలకు నిధులను కేటాయించకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని దీంతో బీజేఎల్పీ నేతగా అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంశంకర్ రెడ్డి, చంద్రప్రకాష్ గౌడ్, ఎం. రాజు, భోజన్న, విలాస్, చిన్నయ్య, రాజేశ్వర్, సాహెబ్ రావు, నరేష్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

రంగు పూల ముఖాలు కవితా సంకలనం ఆవిష్కరణ



రంగు పూల ముఖాలు కవిత్వం ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని స్థానిక కావేరి లైబ్రరీ ప్రాంగణంలో ప్రముఖ కవి లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన రంగు పూల ముఖాలు కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం డాక్టర్ కావేరి ఫౌండేషన్, మానస సాయికి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి మాట్లాడుతూ... లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన ఈ కవితా సంకలనంలో పాఠశాలలో పిల్లల మనస్తత్వాన్ని, వాతావరణాన్ని, ప్రకృతితో పసితనం ఏవిధంగా ముడి వేసుకుంటుందో కవి అద్భు తంగా రచించారని కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు మాట్లాడుతూ... పాఠశాలకు వెళ్లే బాలుర వైవిధ్యమైన మన స్తత్వాన్ని చక్కగా రచించారని కవిని ప్రశంసించారు. మానస సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు తుమ్మల దేవరావు మాట్లాడుతూ... కవిత్వం హృదయ గతమైందని కవి ఏ అంశాన్ని తీసుకున్న అర్థంగా రాయడం, సామాజిక అంశాలను చిత్రీకరించడం ఆధునిక కవులు చేస్తున్నటువంటి గొప్ప ప్రక్రియ అని కొనియాడారు. ప్రముఖ కవులు అబ్బడి రాజేశ్వర్ రెడ్డి, కుమ్మరి నాగారం, దీపక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మారథాన్ పోటీలలో ఖానాపూర్ వైద్యుడి ప్రతిభ

● ఐదున్నర గంటల వ్యవధిలో 42 కిలోమీటర్లు మారథాన్ రన్ పూర్తి

ఖానాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ముంబైలో ఆదివారం నిర్వహించిన మారథాన్ పోటీలలో ఖానాపూర్‌కు చెందిన వైద్యుడు కిరణ్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. 60 వేల మందికి పైగా పాల్గొన్న 42 కిలో మీటర్ల మారథాన్‌రన్ విభాగంలో ఖానాపూర్ వైద్యుడు కిరణ్‌కుమార్ ఐదున్నర గంటల్లో లక్ష్యాన్ని చేరుకుని పలువురి మన్ననలు పొందారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరాలను తెలియజేశారు. గతంలో కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మారథాన్ పోటీలలో పాల్గొని జాతీయ పోటీలకు తాను అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా ముంబైలో నిర్వహించిన పోటీలలో తక్కువ సమయంలో లక్ష్యాన్ని సాధించిన వారి జాబితాలో తాను కూడా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలకు అంతర్జాతీయ లాంగ్ డిస్టెన్స్ రన్నర్ సర్ మో ఫరా ముఖ్యఅతిథిగా హాజరయ్యారన్నారు. 42 కిలో మీటర్ల మారథాన్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వారందరికీ నిర్వాహక సంస్థ టాటా గ్రూప్స్ ఆధ్వర్యంలో మెడల్స్‌ను అందజేశారన్నారు. ఈ పోటీలలో తనకు మెడల్ దక్కడం మర్చిపోలేనిదని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 42 కిలోమీటర్ల మారథాన్ పూర్తి చేసిన వారందరికీ త్వరలో ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలను దక్కుతుందన్నారు. కాగా జాతీయ స్థాయిలో మారథాన్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసేందుకు గత ఆరు నెలలుగా శ్రమించినట్లు వైద్యులు కిరణ్ కుమార్ తెలిపారు. ఈ ఘనత సాధించిన స్థానిక వైద్యులు కిరణ్ కుమార్‌ను పలువురు అభినందించారు.



42 కిలో మీటర్ల మారథాన్ రన్‌ను పూర్తి చేసి నిర్వాహక సంస్థ ప్రతినిధి ద్వారా మెడల్‌ను స్వీకరిస్తున్న వైద్యులు కిరణ్‌కుమార్

విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న జాఫర్ హుస్సేన్

భైంసా రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో సోమవారం ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ రెయిన్బో స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ మున్సిపల్ చైర్మన్ జాబీర్ అహ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రచారానికి

శ్రీకారం చుట్టిన కళాశాల అధ్యాపకులు



పాఠశాలలో మాట్లాడుతున్న అధ్యాపకులు

దిలావర్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పూర్తయ్యాక ప్రభుత్వ కళాశాలలో చేరాలని దిలావర్‌పూర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సోమవారం ముందస్తు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 2025-2026 విద్యా సంవత్సరం కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం వానల్‌పాడ్, తిమ్మాపూర్, కల్లూర్‌లోని ప్రభుత్వ ఉపాఠశాలల్లో విద్యార్థులను కలిసి దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందిస్తున్న గ్రూప్‌ల వివరాలతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాల సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు స్టడీ అవర్ నిర్వహణ, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో విష్ణువర్ధన్, కృష్ణ, శ్రీదేవి, జైపాల్, నజ్నీన్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ధనాలకోట కృష్ణ వర్మ, కోశాధికారిగా దొంతుల గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా ఓడ్నం రమేష్, ఉపాధ్యక్షులుగా కే. నరేందర్, జాయింట్ సెక్రటరీగా ఠాగూర్ సంతోష్, జాయింట్ క్యాషియర్, టి. హరి, ముఖ్య సలహా సభ్యులుగా పి. రఘునాథ్, ఆమెడ శ్రీనివాస్, చింతపండు సుధాకర్, ఉత్తూర్ సంతోష్, సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు.

తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా జాబితా

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా

ఇచ్చోడ, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): తప్పిదాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా సర్వే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సోమవారం మండలంలోని మల్యాల, నర్సాపూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పున:పరిశీలించారు. అనంతరం సర్వే వివరాల గురించి ఆరా తీసి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలో పర్యటిస్తూ వివరాలు నమోదు తీరును పరిశీలించి తప్పులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఓ కైలాష్, ఆర్‌ఐ ఎస్‌కె హెస్సెన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ప్రతిభ చూపాలి

ఆదిలాబాద్‌అర్బన్: రాబోవు పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు తమ సంసిద్ధతను తెలుసుకునేందుకు ఇలాంటి ప్రతిభ పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో జిల్లా స్థాయి విజేతలను అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక అందజేశారు. విజేతలకు ఈనెల21న ఎస్‌వీఎస్ పాఠశాల హయత్ నగర్, హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ పరీక్ష ఉంటుందని ఫోరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిలువేరి రాములు, బెడొద్కర్ సంతోష్ కుమార్‌లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత, సెక్టోరల్ అధికారి శ్రీకాంత్, ఫోరం సభ్యులు రాజేందర్, సతీష్, అజయ్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రిపబ్లిక్ డే వేడుకలకు సంబంధించి మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేజీ ఏర్పాట్లతో పాటు విద్యాశాఖ ద్వారా కల్చరల్ ప్రోగ్రామ్స్ నిరంతర విద్యుత్‌తో పాటు తాగునీరు, సౌండ్‌ప్రూఫ్ జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. అదే విధంగా బారికేటింగ్ పటిష్టంగా చేపట్టాలని, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్స్ వద్ద వచ్చే అతిథులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసు గౌరవందనం సమయపాలన ఉండాలని సూచించారు. అదేవిధంగా అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, డీఎస్పీ జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ ప్రమాద బాధితులను పరామర్శించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: నార్నూర్ మండలంలో ఐచర్ బోల్తా పడిన ఘటనలో గాయపడ్డ వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సోమవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు వరకు అందిస్తున్న వైద్య సేవలు గురించి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు కలెక్టర్‌కు వివరించారు.

ఫటా..ఫట్...

గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ

● నవనీత్, ఎంపీడీవో, కుభీర్



ఆంధ్రజ్యోతి: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎంపీడీవో: మండలంలోని 41 గ్రామ పంచాయతీ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బందితో పాదర్శకంగా సర్వే నిర్వహించాము. మండలంలో మొత్తం 15, 027 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాము.

ఆంధ్రజ్యోతి: అర్హులైన లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేర్లు రాని వారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎంపీడీవో: ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నాము. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నాము. గ్రామ సభల కోసం ఏర్పాట్లు పూర్తి చేశాము.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, పల్లె ప్రగతి నిర్వాహణ పనులు ఎలా సాగుతున్నాయి.

ఎంపీడీవో: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. గ్రామాల్లో పల్లె ప్రగతి పనులపై ఎప్పటికప్పుడు పర్యావేక్షిస్తున్నాము. పంచాయతీ కార్యదర్శులకు సలహాలు, సూచనలు చేస్తూ దిశానిర్ధేశం చేస్తున్నాము. - కుభీర్

చిన్న, సన్నకారు వ్యాపారులే టార్గెట్

● వార సంతల్లో జోరుగా కొనసాగుతున్న వడ్డీ వ్యాపారం

బోథ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వారం రోజులకు ఒకసారి జరిగే వారసంతల్లో వడ్డీ వ్యాపారం జోరుగా కొనసాగుతున్నది. ఫలితంగా చిన్న సన్నకారు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి విలవిలలాడుతున్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు వడ్డీ వ్యాపారులకు దాసోహం కాక తప్పడం లేదని వాపోతున్నారు.

● రోజువారి లెక్కన వడ్డీ

చిన్నచిన్న వ్యాపారులకు ఇచ్చే వడ్డీ రోజువారీగా చెల్లించాల్సి ఉంటుంది. వెయ్యి రూపాయలు వడ్డీ వ్యాపారి వద్ద తీసుకుంటే వంద రూపాయలు కలిపి సాయంత్రం వరకు ఇవ్వాల్సి ఉంటుంది వడ్డీ వ్యాపారిని వెయ్యి రూపాయలు అడిగితే 900 ఇచ్చి సాయంత్రం వెయ్యి రూపాయలు తీసు కుంటారని చిన్నా చితక వ్యాపారులు వాపోతున్నారు. చిరు వ్యాపారుల అవసరాన్ని చూసి పదివేల రూపాయలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు. అంటే లక్ష రూపాయలు పంచితే సాయంత్రం వరకు పదివేల రూపాయలు సంపాదిస్తున్నారు. అడ్డు అదుపులేని ఈ వ్యాపారం వల్ల వ్యాపారులకు ఒక్కో రోజు నష్టమే సంభవిస్తుందని వాపోతున్నారు.

● నిఘా అవసరం

అడ్డు అదుపు లేకుండా చేపడుతున్న ఈ వ్యాపారంపై పోలీసు అధికారుల నిఘా కొరవడింది. దీంతో వడ్డీ వ్యాపారం ఇష్టానుసారంగా కొనసాగుతుంది కొంతమంది వడ్డీ వ్యాపారులు అనతి కాలంలోనే లక్షాధికారులు మారుతున్నారు.

ముగిసిన సప్తాహం

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు


వడ్డాది గ్రామంలో ఎడ్లబండిపై మహారాజును ఊరేగిస్తున్న దృశ్యం

తాంసి , జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సప్తహ కార్యక్రమం సోమవారం ముగిసింది. నిమిషం తీరిక లేకుండా చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి. ముగింపు రోజైన సోమవారం జిల్లా నలు మూలల నుంచే కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ముందుగా గ్రామంలో మేల వాయిద్యాలతో మహిళలు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు వారి వారి వాకిళ్ళను అలికి రంగురంగుల ముగ్గులు వేశారు. గ్రామస్థులు ఏ ఒక్కరు కూడా పనులకు వెళ్లకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ఇచ్చిన ప్రసంగాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆధ్యాంతం కార్యక్రమం భక్తి పారవశ్యంతో జరిగింది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెక్కి షేకన్న అధ్యక్షత వహించారు.

ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాకు స్పందన

ఉట్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభు త్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాకు స్పందన లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేళాకు ముంబై, హైదరాబాద్, పుణేలకు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 3 4 మంది అభ్యర్థులు హాజరు కాగా 27 మందిని వివిధ తంత్రలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పద్మ, గుల్షన్‌కుమార్, వినోద్‌కుమార్, సంగీత, ఇర్ఫాన్, బాలాజి, రఘు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుడిహత్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎరుకుల నారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలను అందజేశారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నలంద రామకృష్ణ, లకావత్ కిషన్, మర్రిపల్లి రాజాగౌడ్, ఏతే గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


గుడిహత్నూర్‌లో వినతిపత్రం స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ

వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

● కిడ్నీ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటాం
● జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

తలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ కోరారు. సోమవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య అధికారి నరేందర్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ చర్లపల్లి గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో గ్రామస్థులు బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అలాగే బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమన్నారు. వివిధ రకాల వ్యాధులు గుర్తించిన గ్రామ రోగులను రిమ్స్‌కు రిఫర్ చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కలుషిత నీటి వల్లనే పలు వ్యాధులు వ్యాపిస్తాయని అందుకే స్వచ్ఛమైన నీటిని తాగాలని సూచించారు. జిల్లాలో బాలవికాస ద్వారంలో దాదాపు 300 బాలవికాస కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అలాగే చర్లపల్లి గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్థులకు, కేన్సర్ వ్యాధిగ్రస్థులకు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో గల ఏకబిల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జరి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రాథమిక వైద్యులు హరీష్, సిబ్బంది చిన్నయ్య, శ్రీనివాస్, జరీ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గంగారాం పటేల్, రామ్‌రెడ్డి, బాలవికాస్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా డైరెక్టర్ దెబ్బడి అశోక్, ప్రసూన్ రెడ్డి, గ్రామ యువజన సంఘం సభ్యులు వరుణ్, తదితరులు పాల్గొన్నారు.


చర్లపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్

ఆదిలాబాద్ పై మళ్లీ చలిపంజా

● బేల మండలంలో 8.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా పై మళ్లీ చలిపంజా విసురుతుంది. గత రెండు మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. పగలంతా భానుడి భగభగలు కనిపిస్తున్న సాయంత్రం నాలుగైదు గంటల నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. కనిష్ట గరిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. సోమవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 30.0 డిగ్రీలు కాగా కనిష్టంగా 8.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా బేల మండలంలో 8.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.2, జైనథ్‌లో 8.5, మావలలో 9.2, బోథ్‌లో 9.3, ఆదిలాబాద్‌రూరల్‌లో 9.7 ఇలా జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యవసరమైతే తప్ప ఉదయం సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లవద్దంటూ వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన చలి ప్రభావంతో శ్వాస కోశ వ్యాధుల బారిన పడి జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, అస్తమా లాంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు వెచ్చని ప్రదేశాలలో ఉండడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● బంజారా సేవా సంఘం


నార్నూర్‌లో రైతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బంజారాలు

నార్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ద్వారా తీసు కున్న రుణం చెల్లించా లంటూ అధికారులు వేధింపుల చేయడం తో జాదవ్ దేవరావు ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా ఆ బ్యాంక్ అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసు కుంటూ ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకునేలా రూ.50లక్షల మంజూరు చేయాలని బంజారా సేవా సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక గాంధీచౌక్ వద్ద మృతి చెందిన రైతు దేవరావు చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పించిన ప్రముఖులు. ఏడాది పంటలు సరిగా తీసుకున్న రుణాలు ఎలా చెల్లించాలో అయోమయంలో ఉన్న రైతులను బ్యాంకు అధికారులు ఇబ్బంది పెట్టడం మంచిది కాదని పేర్కొ న్నారు. కుటుంబ యజమాని లేనప్పుడు ఆ ఇంటి పరిస్థితి ఎలా ఒక్క సారి ఉంటుందో ఒక్కసారి ఆలోచించాలని హితవు పలికారు. వెంటనే అటు కుటుంబానికి న్యాయం జరిగేలా ఒకరి ఉద్యోగం మంజూరు చేయా లని వారు డిమాండ్ చేశారు. వారి వెంట స్థానిక మాజీ సర్పంచ్ బి.గజా నంద్ నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తమ్ రాథోడ్, ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, దేవరావు లోకండే, ప్రకాష్ చౌవాన్ , అశోక్ రాథోడ్, కోరల మహేందర్, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లను అందించలేం

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడే నాందేవ్

నార్నూర్ మండల విద్యాధికారి అనితకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



నార్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం కు రాష్ట్ర ప్రభుత్వమే కోడి గుడ్ల సరఫరా చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడే నాందేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీలు చాలా తక్కువగా ఉన్నందున మార్కెట్‌లో ఒక్క కోడి గుడ్డు ధర రూ.8 ఉన్నాయని, ప్రభుత్వం తమకు కేవలం రూ.5 మంజూరు చేస్తుందన్నారు. దీంతో మేము చాలా నష్టపోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెనూ చార్జీలను పెంచుతూ వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల చేయాలన్నారు. కార్మికులకు రూ.10 వేలు ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలన్నారు. వంటశాలలో ప్రమాదహితంగా జరిగిన వారికి బీమా సౌకర్యం కలిగించాలన్నారు. గతంలో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి రూ.25 మెనూ చార్జీ మంజూరు చేయాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల విద్యాధికారి పవర్ అనితకు అందజేశారు. వారి వెంట కార్మికులు తాయిబాయి,స్రవంతి బాయి, సులోచన బాయి, కవిత బాయి, సలీం పాల్గొన్నారు.

అలరించిన అపూర్వ విద్యార్థుల సమ్మేళనం


బోరిగామలో అపూర్వ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఇచ్చోడ, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగామ గ్రామంలో 25ఏళ్ల క్రితం చదువుకున్న వారందరూ ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న వారు సోమవారం అందరూ ఒకేచోట కలుసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు గురువులు చూపిన మార్గదర్శకంలో నడిచి తాము ఉన్నత స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన గురువులకు పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నాటి ఉపాధ్యాయులు మోహన్‌రావ్, విద్యాసాగర్, అంజలి, రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి, పదో తరగతి పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దోడందాకు చేరిన గంగాజల పాదయాత్ర

● ఈ నెల 24న ఇంద్రాయి దేవతకు పూజలు ● 28న మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం
● గ్రామ పోలిమేరలోని ఓ చెట్టుపై గంగాజలం భద్రపరిచిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవతకు పుష్యమాసం అమవాస్యను పురస్కరించుకొని ఈ నెల 28న మెస్రం వంశీయులు నాగోబా మహాపూజలతో ప్రారంభించనున్నట్లు కేస్లాపూర్ నాగోబా మహాపూజకు అవసరమగు పవిత్రమైన గంగా జలం కోసం ఈనెల 10న కేస్లాపూర్ నుంచి బయల్దేరి వెళ్లిన మెస్రం వంశీయులు ఈనెల 17న జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు వద్ద ప్రత్యేక పూజలు మధ్య పవిత్ర గంగాజలం సేకరించి ఆదివారం ఉట్నూర్ మండలం నర్సాపూర్ గ్రామపోలిమేరలో కొద్దిసేపు నిలకడ చేసి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం రాత్రి అక్కడి నుంచి గంగాజలంతో దోడందకు బయల్దేరారు. గ్రామ పోలిమేరలోని ఓ చెట్టుపై అల్లుడిచేత గంగాజలం కలశాన్ని భద్రపర్చారు. కలశానికి మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి మొక్కు కున్నారు. మెస్రం వంశీయులు గంగాజలంతో ఆదివారం రాత్రి వచ్చే మెస్రం వంశీయులు ఈనెల 23 వరకు విరామం కోసం తమ తమ గ్రామాలకు వెళ్లిపోయారు. ఈనెల 24న దోడంద నుంచి మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి అదేరోజు రాత్రి కేస్లాపూర్ గ్రామ సమీపంలో గల మర్రి చెట్టు వద్దకు చేరి బస చేయనున్నారు. మర్రి చెట్టు వద్ద మూడు రోజులు సంప్రదాయ పూజలు చేయనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. ఈ నెల 28న పుష్య మాసం అమవాస్యను పురస్కరించుకొని అర్ధరాత్రి పవిత్ర గంగాజలంతో నాగోబా దేవతకు జలాభిషేకం, మహాపూజ నిర్వహించి నాగోబా జాతరను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కటోడ మెస్రం దేవ్‌రావు, కటోడ మెస్రం కోసేరావు, ప్రర్ధాంజీ మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


గ్రామ పోలిమేరలోని ఓ చెట్టుపై గంగాజలం భద్రపరిచిన మెస్రం వంశీయులు


రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) ప్రయాణాల సమయంలో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఏఎంవీఐ ఫాహిమా సుల్తాన తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తీసుకెళ్లవద్దన్నారు. ప్రతీ ఒక్క వాహనదారుడికి తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ఇందులో నల్ల ప్రత్యూష, గోపిచంద్, ఏఆర్ టీం తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరిత గతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్) జాదవ్ వ సంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉ ట్నూర్ మండల కేం ద్రంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఆ సిఫాబాద్ మండలం భీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్ తనకు బోర్‌వెల్ మంజూరు చేయించమని, జైనూర్ మండలం జంగావ్ గ్రామానికి చెందిన మౌనిక తమ గ్రామానికి అంగన్‌వాడీ సెంటర్ మంజూరు కల్పించాలని, సిర్పూర్ (టి) మండలం వేంపల్లి కోలాంగూడ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసు కోవాలని సంబంధిత శాఖల అధికారులను ఏపీఓ వసంత్‌రావు ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్‌లో ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏఓ దామోదర్ స్వామి, పేసా కోఆర్డినేటర్, వసంతరావు, మేనేజర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ అధికారులు, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పై ఆసక్తి ఏదీ!?



- జిల్లాలో ఎన్నికల ఉత్సాహం కరువు
- అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు
- అధికార పార్టీ టికెట్ కోసం పెరిగిన పోటీ
- అభ్యర్థిని ఇప్పటికే ప్రకటించిన బీజేపీ

నిర్మల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలపై జిల్లాలో ఇంకా కనీస హడావిడి కనిపించడం లేదు. ఎన్నికల సమయం సమీపిస్తున్నప్పటికీ ఇంకా అభ్యర్థులు ఎవరన్నది తేలకపోవడంతో ఓటర్లలో నిరాసక్తత నెలకొంది. గతంలో పట్టభద్రుల ఎన్నికల కోలాహలం విపరీతంగా కనిపించేది. కానీ ఈ సారి జరుగుతున్న ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల వేడి అసలే కనిపించడం లేదు. దీనికి అభ్యర్థుల ఎంపిక ఆలస్యం ప్రధాన కారణంగా కనిపిస్తున్నది.

బీజేపీ అభ్యర్థి ఖరారు..
ఇంకా తేల్చని కాంగ్రెస్, బీఆర్ఎస్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ ఇప్పటికే మెదక్ జిల్లాకు చెందిన అంజిరెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ తరఫున క్రమంగా ప్రచారం కూడా మొదలైంది. బీజేపీకి నిర్మల్ జిల్లాలో మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ ఇద్దరు శాసనసభ్యులు ఉండడం సానుకూల అంశంగా కనిపిస్తోంది. దీంతో ఆ పార్టీ ప్రచార ఊపు క్రమంగా మొదలైంది. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇంకా అభ్యర్థులనే ఖరారు చేయలేదు. బీఆర్ఎస్ పార్టీ నుంచి అసలు టికెట్ ఆశిస్తున్న వారి పేర్లు ప్రచారంలోకి రావడం లేదు. జిల్లాతో పాటు పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి కూడా అభ్యర్థుల పేర్లు తెరపైకి రావడం లేదు. చివరకు ఆ పార్టీ పోటీలో ఉంటుందా లేదా అన్నది కూడా అనుమానంగానే ఉందని పార్టీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. మరోవైపు అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థి ఎంపిక విషయంలో మీన మేషాలు లెక్కిస్తోంది. అభ్యర్థి ఎంపిక జాప్యం ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మళ్లీ అవకాశం ఇస్తారా లేదా అన్నది ఇంకా తేలలేదు. ఈ వారంలోనే అభ్యర్థిని ప్రకటిస్తామని అధిష్టానం పలు సార్లు ప్రకటించినప్పటికీ ఇంకా ఉత్కంఠ వీడడం లేదు.



అధికార పార్టీ టికెట్‌కు డిమాండ్

పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం అభ్యర్థుల నుంచి పోటీ ఎక్కువగా కనిపిస్తున్నది. సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే కొత్త అభ్యర్థికి టికెట్ ఇచ్చే అవకాశాలు నెలకొన్నాయి. టికెట్ ఆశిస్తున్న పలువురు అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌గౌడ్‌లతో పాటు పలువురు మంత్రులు, సీనియర్ నేతలతో లాబీయింగ్ చేయిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఆర్థిక సామాజిక సమీకరణలను బట్టి ఉండే అవకాశం ఉండడంతో పార్టీ అలాంటి అభ్యర్థి కోసం చూస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కరీంనగర్‌కు చెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. దీన్ని కొంతమంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లు, కొంతమంది మంత్రులు వ్యతిరేకిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతున్నది. మరోవైపు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణ కూడా బలంగానే టికెట్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. ఈయనకు ఇద్దరు బీసీ మంత్రులు గట్టి లాబీయింగ్ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన పోలీసు అధికారి గంగాధర్ కూడా గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. ఇలా మరో నేత కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ అధిష్టానం ఇప్పటి దాక ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై తీవ్రప్రభావం చూపుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే గతం కన్నా భిన్నంగా ఈ ఎన్నికలపై పట్టభద్రులు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎన్‌రోల్‌మెంట్ కూడా గతంలో పోలిస్తే తక్కువగానే నమోదైనట్లు చెబుతున్నారు. అభ్యర్థులను ప్రకటిస్తే గానీ ఎన్నికల కోలాహలం మొదలయ్యే పరిస్థితులు లేవు.

జిల్లాలో ఎన్నికల ఉత్సాహం కరువు

రాజకీయాలకు కేంద్రబిందువైన నిర్మల్ జిల్లాలో శాసన మండలి ఎన్నికల వేడి అసలే కనిపించడం లేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్మల్‌కు చెందిన ఉపాధ్యాయుడు సాయన్న తన ఉద్యోగానికి రాజీనామా చేయడం చర్చకు దారి తీస్తున్నది. అయితే పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి మాత్రం ఇంకా అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో జిల్లాలో అసంతృప్తి వాతావరణమే ఉంది. అయితే ఓటర్లు స్వచ్ఛందంగా అభ్యర్థుల కోసం పని చేసే పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అభ్యర్థులు అన్ని పార్టీల నుంచి తేలితే గానీ రాజకీయ వర్గాల్లో ఉత్సాహం పెరిగే అవకాశం కనిపించడం లేదు.



కస్టమ్ మిల్లింగ్ రైస్
ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ సరఫరాపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మిల్లర్ సీఎంఆర్ సరఫరాలో వేగం పెంచాలని ఆదేశించారు. సీఎంఆర్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యం, పూర్తి చేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం, రోజువారీగా తరలిస్తున్న ధాన్యపు లారీల వివరాలను మిల్లర్ల వారీగా సమీక్షించారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లులో ధాన్యం నిల్వ, సామర్థ్యం, మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం, అన్ లోడింగ్ తదితర అంశాలను పరిశీలించి రోజువారి నివేదికలను అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం సివిల్ సప్లైస్ వేణుగోపాల్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గంలోని
పోడు భూముల సమస్యను పరిష్కరించండి
- మంత్రి కొండా సురేఖను కోరిన ఖానాపూర్ ఎమ్మెల్యే


మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, స్థానిక నాయకులు

ఖానాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగ కడెం మండలంలోని లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని ఆయన మంత్రిని కోరారు. ఈ వివరాలను ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి. రమేష్, రాపెల్లి రాజలింగు, మాజీ సర్పంచ్ తిరుపతి, లచ్చన్న, శంకర్, శేఖర్, దుర్గం మల్లేష్, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, మొగిలి నాగరాజు, కడెం మండల లక్ష్మీపూర్ గ్రామ నాయకులు, తదితరులున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి


ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో రాధారాథోడ్

లక్ష్మణచాంద, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు మంచి వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఎంపీడీవో రాధా రాథోడ్ సోమవారం అన్నారు. మండల కేంద్రమైన లక్ష్మణచాందలో యాక్సెంచర్, ఈడీడీఐ వారి ఆధ్వర్యంలో చేతితో తయారు చేసిన నగలపై 26 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలలో ఆత్మస్థైర్యం నింపారు. అనంతరం ఎంపీడీవో రాధా రాథోడ్‌ను ఆ శిక్షకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రవి, అలేఖ్య, మహిళలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు
విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఖానాపూర్ ఏఈ రాంసింగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 33/11 కేవీ ఎస్ఎస్ సుర్జాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ బ్రేకర్ ఏర్పాటు చేయనున్న కారణంగా ఆ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన సుర్జాపూర్, బాధనకుర్తి, మస్కాపూర్, మేడంపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు దంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న ఈ అంతరాయానికి ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

బడి బయట పిల్లల గుర్తింపు


బడి బయట పిల్లలను బడిలో చేర్పించిన దృశ్యం

ముథోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామ పంచాయతీ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ) భూమన్న బడి బయట విద్యార్థుల సర్వే చేసి వారిని సోమవారం స్థానిక పాఠశాలలో చేర్పించారు. చించాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇటుక బట్టీలు అన్నింటిని సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థులను గుర్తించి స్థానికంగా ఉన్నటువంటి పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యామ గౌడ్ రాజశేఖర్ చారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామసభలు

24 వరకు నిర్వహించే గ్రామసభలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి ... కచ్చితంగా సమయపాలన
- కలెక్టర్ అభిలాష అభినవ్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రభుత్వ పథకాల అమలుకు రేపటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, నూతన ఆహార భద్రత కార్డులు (రేషన్‌కార్డులు), రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం రేపటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా గ్రామసభల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించి, అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500ల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. పథకాల అమలుపై ప్రజలకు ఎటువంటి సందేహాలు ఉన్న గ్రామసభల్లో అధికారులు నివృత్తి చేస్తారని తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో వివిధ పథకాలకు దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

21 నుంచి గ్రామసభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్‌లతో కలిసి సంబంధిత అధికారులతో ఆమె నూతన పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు రేపటి నుంచి ఈ నెల 24వ వరకు గ్రామసభల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన సంక్షేమ పథకాల అమలుకు రేపటి నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించే గ్రామసభలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా కచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి ప్రత్యేక అధికారి తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామసభల్లో వచ్చే అర్జీలను స్వీకరించాలని సూచించారు. గ్రామసభలకు విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ, వార్డు సభలు, సంక్షేమ పథకాల రోజువారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీపీవో శ్రీనివాస్, డీఎస్‌వో కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు భద్రత చర్యలను పటిష్ఠ పరుచుకోవాలి

- జిల్లా ఎస్పీ డా. జి. జానకీ షర్మిల


సమావేశానికి హాజరైన బ్యాంకు ఉద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు భద్రత చర్యలను పటిష్ఠపరుచుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లాలో ఒక్క బ్యాంకులో కూడా దొంగతనం జరగవద్దనే ముఖ్య ఉద్దేశ్యంతో అన్ని బ్యాంకు అధికారులతో పటిష్ఠ భద్రత పరమైన చర్యల నిమిత్తం జిల్లా ఎస్పీ డా. జి. జానకీషర్మిల అధ్యక్షతన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారులతో లావాదేవీలు నిర్వహిస్తున్న వివిధ శాఖలకు చెందిన ఆయా బ్యాంకులు భద్రత చర్యలను పటిష్ఠపరచుకోవాలన్నారు. పోలీస్ అధికారులందరూ వారి వారి పరిధిలోని మండల కేంద్రంలోని వివిధ శాఖలకు చెందిన బ్యాంకులను ఆకస్మాత్తుగా సందర్శించాలని, బ్యాంకు పరిసర చుట్టు ప్రాంతాలను, బ్యాంకు లాకర్లను వాటి పనితీరును ఆయా బ్యాంకుల మేనేజర్లు, సిబ్బందితో కలిసి పరిశీలించాలని ఆదేశించారు. బ్యాంకుల భద్రత చర్యలపై మేనేజర్ అకౌంటెంట్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రతిరోజు బ్యాంకు మూసి వేసేముందు లాకర్లు వాటి అలారమ్ సిస్టమ్ సరిగా పని చేస్తున్నాయా లేదా పటిష్ఠంగా ఉన్నాయా లేదా బ్యాంకు నగదు లావాదేవీలు ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల పర్యవేక్షణలో సరిచూసుకోవాలి. రుణగ్రస్తులు తమ బ్యాంకుల్లో తకట్టు పెట్టిన బంగారం నిల్వలు పర్యవేక్షిస్తూ సరిచూసుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు అన్ని దిక్కుల ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏటీఎంలలో అలారమ్ సిస్టమ్ పని చేస్తుందా లేదా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి. ఇటీవల నిర్మల్ పట్టణంలో ఒక వ్యక్తి ఏటీఎంలో దొంగతనానికి పాల్పడితే ఆ బ్యాంకు మేనేజర్‌కి అలారమ్ రావటంతో వెంటనే తాను డయల్ 100కి కాల్ చేయటం వల్ల అట్టి దొంగతనాన్ని మా పెట్రోలింగ్ అధికారులు ఆపటమే కాకుండా దొంగను కూడా పట్టుకున్నారు. బ్యాంకులలో సీసీ కెమెరాలు నిత్యం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ అనునిత్యం తమకు అందుబాటులో ఉండి భద్రత చర్యలను పర్యవేక్షిస్తుందని, బ్యాంకుల పరిధిలో ఏమైనా భద్రత సమస్యలు తలెత్తితే పోలీస్ శాఖ వారికి సమాచారం ఇచ్చి భద్రత చర్యలను కట్టుదిట్టం చేసుకోవాలన్నారు. మీ బ్యాంకు పరిసర ప్రాంతాల్లో నివసించే వారిపైన అనుమానాస్పదంగా ఉంటే మీ దగ్గరలోని పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిత్యం ప్రజారక్షణే ధ్యేయంగా ప్రజల ఆస్తులను ప్రభుత్వ ఆస్తులను సంరక్షిస్తూ తమ ప్రాణాలు పణంగా పెట్టి భద్రత కల్పించడమే నిర్మల్ పోలీసుల లక్ష్యమన్నారు. అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలని కోరారు. చివరగా బ్యాంకులో ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేసి తీసుకువెళ్లే వారికి బ్యాంకు అధికారులు భద్రత పరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, రాజేష్ మీనా ఐపీఎస్, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ బలోపేతానికి పటిష్టమైన చర్యలు
- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

ముథోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూ కేటీ బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటీ బాసర పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్ నందు సోమవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అధ్యక్షతనసమీక్షా సమావేశం నిర్వహించారు. పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీధర్షన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. రెండవ సెమిస్టర్ ప్రారంభమవుతున్న సందర్భంగా తీసుకోవలసిన చర్యలు, నిర్వర్తించవలసిన విధులు, అకాడమిక్ సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ దిశా నిర్దేశం చేస్తూ వివిధ విభాగాల ఇన్‌స్ట్రక్చర్ , పరీక్షల నిర్వహణ, ఇంటెన్షిప్, లైబ్రరీ బలోపేతం, పీయూసీ విద్యార్థిని విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు గేట్ తరగతులను నిర్వహించడం, టెక్ ఫెస్ట్ నిర్వహణ, కల్చరల్ ఫెస్ట్, స్పోర్ట్స్ డే తదితర కార్యక్రమాలను మార్చిలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ విభాగం నుంచి బడ్జెట్ ప్రపోజల్‌ను అందించాలని సూచించారు. కెరీర్ గైడెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థిలో ప్రతిభను నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో
పర్యటించిన మాజీ మంత్రి అల్లోల

లక్ష్మణచాంద, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ, పర్యావరణ శాఖల మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం మండలంలో పర్యటించారు. మల్లాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ కేశం లక్ష్మీ రమేష్ మామయ్య కేశం ముత్తన్న అనారోగ్యానికి గురైన విషయాన్ని తెలుసుకొని ఆయనను పరామర్శించి, అతని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కొమ్ముల రత్నవ్వ మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.